సాక్షి ఏలూరు

శనివారం, 13, ఏప్రిల్, 2024



నగదు స్వాధీనం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. నిబంధనలు మీరి నగదు తరలిస్తే సీజ్ చేస్తున్నారు. 8లో ▸

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన మెచ్చి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. 8లో ▸



పచ్చ పైత్యం భరించలేక..

పచ్చ బ్యాచ్ కుట్రలు తాళలేక రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. 8లో ▸

న్యూస్‌రీల్

గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో ప్రతిభ



అభ్యర్థులను అభినందిస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ఆధ్వర్యంలో వైటీసీలో శిక్షణ పొందిన 9 మంది అభ్యర్థులు ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 70 మందికి 25 రోజులపాటు ఉచిత శిక్షణ అందించగా 9 మంది ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో గ్రూప్-2 మెయిన్స్‌లో కూడా సత్తాచాటాలని ఆకాంక్షించారు. వీరికి మెయిన్స్ శిక్షణ కూడా అందిస్తామన్నారు. ఇన్‌చార్జి డీడీ పీపీఎస్ నాయుడు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. అలాగే ఒకే ఊరు నుంచి 50 మంది భక్తులు ఉంటే వారి కోసం కూడా ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వివరాలకు సమీపంలోని డిపో మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కళాశాలలు నిట్, ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్స్ రెండో విడత పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 182 మందికి 98 మంది, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 43 మంది హాజరయ్యారు. ఈనెల 4 నుంచి ఇప్పటివరకు 2,918 మంది విద్యార్థులకు 2,567 మంది హాజరయ్యారు. పరీక్షలను కో-ఆర్డినేటర్ పి.సాయి కుమారి శంకర్ పర్యవేక్షించారు.

ఓటరుగా నమోదు కావాలి

భీమవరం: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ కోరారు. శుక్రవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు హక్కు, ఓటు నమోదుపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లోనూ ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మా ట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమయ్యేందుకు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

నిఘా.. పక్కా

- ఫిర్యాదుపై 100 నిమిషాల్లో చర్యలు
- సీ-విజిల్‌పై స్పెషల్ ఫోకస్
- జిల్లాలో 291 ఫిర్యాదులు
- 46 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- 36 స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్‌లు
- సువిధ ద్వారా 796 అనుమతుల మంజూరు
- పీఓ, ఏపీఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు
- 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ
- జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి



కలపర్రు టోల్‌గేట్ వద్ద బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)



జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: జిల్లాలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తున్నాం.. ప్రతి ఫిర్యాదుపై సత్వరమే విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటున్నాం.. అనుమతుల మంజూరు, కోడ్ ఉల్లంఘనలు, సిబ్బందికి శిక్షణ తరగతులు ఇలా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్నింటినీ పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి స్పష్టం చేశారు. ప్రధానంగా సీ-విజిల్ యాప్‌లో నమోదయ్యే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటున్నామని ఆమె వెల్లడించారు. ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో ఉందని చెప్పారు. శుక్రవారం 'సాక్షి ప్రతినిధి'తో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు.

విస్తృతంగా తనిఖీలు

ఎన్నికల కోడ్ జిల్లాలో అమలులోకి వచ్చినప్పటి నుంచి తనిఖీల ప్రక్రియ విస్తృతంగా కొనసాగుతోందని జేసీ చెప్పారు. సీ-విజిల్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 291 ఫిర్యాదులు రాగా వాటిలో 101 ఫిర్యాదులు ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించినవి కాకపోవడంతో వాటిని తొలగించామని, 190 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏలూరు జిల్లాలో 46 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 38 స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్‌లు, 24 వీడియో సర్వేలెన్స్ టీమ్‌లు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నాయని చెప్పారు. ప్రధానంగా దెందులూరు, పోలవరం నియోజకవర్గాల్లో ఎక్కువ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రచారం మొదలు ఇతర అంశాల వరకు అన్నింటికీ సువిధ ద్వారా అనుమతులు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సువిధలో 1,145 దరఖాస్తులు రాగా.. 796 అనుమతులు మంజూరు చేశామన్నారు. మరో 315 దరఖాస్తులను తిరస్కరించామని, 34 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సువిధ యాప్‌లో దరఖాస్తులకు 48 గంటల వ్యవధిలో అనుమతులు మంజూరు చేస్తున్నట్టు ఆమె తెలిపారు.

పీఓ, ఏపీఓలకు శిక్షణ : పీఓ, ఏపీఓలకు మొదటి దశ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈవీఎం, వీవీ ప్యాడ్, ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీలు, కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో జరిగిందని జేసీ వివరించారు. మరోమారు ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి పోలింగ్‌కు పది రోజుల ముందు విధుల కేటాయింపు చేస్తామని చెప్పారు. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల ప్రక్రియ కోసం ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా తాను బాధ్యతలు నిర్వహిస్తున్నానని, అక్కడ 10 బృందాలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా రూ.12.92 కోట్ల విలువైన బంగారం, వెండి సీజ్ చేశామని, నగదు, బంగారానికి సంబంధించి ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు కూడా సమాచారం అందిస్తున్నామని జేసీ లావణ్యవేణి వివరించారు.

అభ్యర్థుల ప్రచారంపై ప్రత్యేక నిఘా

అభ్యర్థుల ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని జేసీ చెప్పారు. కెమెరా సర్వేలెన్స్ టీమ్‌లు, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్‌లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, గ్రామ, మండల స్థాయిలో వివిధ విభాగాల అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కోడ్ ఉల్లంఘనలను పరిశీలించడంతో పాటు ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం ఒకే సమయంలో, ఒకేచోట జరగకుండా పర్యవేక్షిస్తున్నామని ఆమె వివరించారు.

పారదర్శకంగా ఈవీఎంల ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామన్నారు. ఏలూరు జిల్లాలో 1,743 పోలింగ్ స్టేషన్లకు 4,184 బ్యాలెట్ యూనిట్లు, 4,184 కంట్రోల్ యూనిట్లు, 4,534 వీవీప్యాట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు 20 శాతం, వీవీ ప్యాట్లు 30 శాతం అదనంగా కేటాయించామన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, నోడల్ అధికారి కె.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు డి.సూర్యచంద్రరావు (వైఎస్సార్‌సీపీ), లైన నెరుసు నెలరాజు (బీజేపీ), ఎస్‌బీ ప్రసాద్ (కాంగ్రెస్), ఉండవల్లి బాలానందం (టీడీపీ), ఎస్.కాశీనరేష్ (జనసేన) తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేయడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని, ఆయన చేసిన మేలును చూసి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించాలని పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి కోరారు. జీలుగుమిల్లి మండలం రామచంద్రాపురం, రెడ్డిగూడెం, దిబ్బగూడెం, అంకన్నగూడెం, తల్లవరం ఆర్ అండ్ ఆర్ కాలనీ, పూచికపాడు, రాచన్నగూడెం, తాటిరామన్నగూడెం, గోపాలపురం, లంకాలపల్లి, జిల్లెళ్లగూడెం సచివాలయాల పరిధిలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. 2014 ఎన్నికల్లో 600కుపైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. మళ్లీ ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టడానికి కూటమి పేరుతో జెండాలు జతకట్టి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ప్రజల ముందుకు వస్తున్నాయని విమర్శించారు. వారి మాటలను ప్రజలు నమ్మొద్దని అన్నారు. గత 58 నెలల్లో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని మడమ తిప్పని నాయకుడిగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.



రాచన్నగూడెంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి

ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

నూజివీడు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక సంరంభం ద్వారా తమలోని విజ్ఞాన భావాలను మరింతగా పెంపొందించుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో టెక్‌జైట్-24ను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మానవ సంక్షేమ కోసం కొత్త ఆవిష్కరణల వైపు విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఆర్జీయూకేటీ విద్యార్థులకు ఎల్లవేళలా నాణ్యమైన ఆధునిక సాంకేతిక విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వీలవుతుందన్నారు. దీని ద్వారా సాంకేతిక విద్యకు సంబంధించిన విషయాలను ఒకరికొకరు పంచుకోవడానికి వీలవుతుందన్నారు. విద్యార్థులు సాంకేతిక రంగంలో తమకున్న ప్రతిభను నిరూపించుకోవడానికి, వారి నైపుణ్యాలను పెంచుకోవడానికి వేదికవుతుందన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులు తమ ప్రతిభను మెరుగు పరుచుకోవడంతో పాటు నైపుణ్యాలను కలిగి ఉండాలన్నారు. టెక్‌జైట్-24లో పాల్గొనేందుకు 1,171మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల కోసం 12 వర్క్‌షాపులు, 33 టెక్నికల్ ఈవెంట్‌లు, మూడు ఆహ్వానిత చర్చలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, టెక్‌జైట్ కన్వీనర్ జ్యోతీలాల్ నాయక్, సెంట్రల్ డీన్ దువ్వూరు శ్రావణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ హేమచంద్రారెడ్డి

కొనుగోళ్లకు ప్రాధాన్యం

- జిల్లాలో రబీ ధాన్యం సేకరణ
- ఇప్పటికే 1,027 టన్నుల కొనుగోలు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు



ఉంగుటూరులో రాశుల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఖాజావలీ (ఫైల్)


ఏలూరు(మెట్రో): రబీ ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా మండుతున్న ఎండలను కూడా లెక్కచేయకుండా సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ముందుకు వెళుతూ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 120 రైతు భరోసా కేంద్రాలు, 66 ప్రాథమిక సహకార సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు జిల్లా అధికారులు రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా 15 ఆర్‌బీకేలలో ధాన్యం కొనుగోలు ఇప్పటికే ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్కరోజే 665 టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటివరకు 1,027 టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించారు. 87 మంది రైతులు, 105 ఎఫ్‌టీఓల వద్ద నుంచి రూ.2.22 కోట్ల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించేందుకు బిల్లులు సిద్ధం చేశారు.

మద్దతు ధరలకు..

ధాన్యం కామన్ రకం క్వింటాల్‌కు రూ.2,183, గ్రేడ్-ఎ రకం క్వింటాల్‌కు రూ.2,203 ధరలకు అధికారులు కొనుగోలు చేస్తున్నారు. కోతలు పూర్తి చేసుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వచ్చి కొనుగోలు షెడ్యూల్‌ను ఏర్పాటు చేయించుకుని ఆ తేదీ ప్రకారం విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. ర్యాండమ్ ద్వారా రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు అధికారులు నిర్ణయించి ఎటువంటి అక్రమాలకు తావులేకుండా, దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని 16 నుంచి 17 వరకు ఉండేలా ఆరబెట్టుకుని రైతులు బయోమెట్రిక్ విధానం ద్వారా ధాన్యాన్ని కళ్లాల వద్దే విక్రయించుకునే ఏర్పాట్లను జిల్లా అధికారులు పూర్తి చేశారు. గోనె సంచులకు సైతం ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసి అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉంచుతున్నారు. మొత్తంగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటర్‌లో బాలికలదే హవా

- ఇంటర్ ఫస్టియర్‌లో 6, సెకండియర్‌లో 8వ స్థానం
- 24 వరకు సప్లిమెంటరీ దరఖాస్తులకు అవకాశం
- సత్తాచాటిన ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు



ఏలూరులో ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థినులు (ఫైల్)

	విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
ప్రథమ సంవత్సరం	14,870	10,581	72
ద్వితీయ సంవత్సరం	13,120	10,355	80

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో జిల్లా బాలికలు సత్తాచాటారు. బాలికల ఉత్తీర్ణత 79 శాతం నమోదైంది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో 6వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 8వ స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 14,870 మంది పరీక్షలు రాయగా 72 శాతంతో 10,581 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఎయిడెడ్ విద్యార్థులు 309 మందికి 152 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు 446 మందికి 349 మంది, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు 309 మందికి 234 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 1,460 మందికి 670 మంది, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 212 మందికి 71 మంది, కస్తూరిబా బాలికా విద్యాలయాలకు చెందిన 45 మంది విద్యార్థినులకు 38 మంది, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులు 12,089 మందికి గాను 9,067 మంది ఉత్తీర్ణులయ్యారు.

ద్వితీయ సంవత్సరంలో.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 13,120 మంది పరీక్షలు రాయగా 80 శాతంతో 10,355 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఎయిడెడ్ విద్యార్థులు 235 మందికి 162 మంది, ఏపీ సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు 388 మందికి 303 మంది, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులు 239 మందికి 205 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 1,268 మందికి 788 మంది, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు 111 మందికి 32 మంది, కస్తూరిబా బాలికా విద్యాలయాలకు చెందిన 37 మంది విద్యార్థినులకు 32 మంది, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులు 10,842 మందికి గాను 8,833 మంది ఉత్తీర్ణులయ్యారు.

భళా బాలికలు

ఇంటర్ ఫలితాల్లో బాలికలు ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సరంలో 6,348 మంది బాలికలు ఉత్తీర్ణులు కాగా బాలురు 4,233 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 6,202 మంది బాలికలు ఉత్తీర్ణులు కాగా బాలురు 4,153 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించిన ఫలితాల్లో మొత్తంగా బాలికల ఉత్తీర్ణతా శాతం 79 కాగా బాలుర ఉత్తీర్ణతా శాతం 69గా నమోదైంది.

18 నుంచి సప్లిమెంటరీకి దరఖాస్తులు

ఫెయిలైన విద్యార్థులు ఈనెల 18 నుంచి సప్లిమెంటరీ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా వృత్తి విద్యాధికారి బి.ప్రభాకర్ తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షల దరఖాస్తుకు ఈనెల 24 వరకు గడువు ఉందన్నారు. అలాగే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 18 నుంచి 24 వరకూ సంబంధిత కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాగా సప్లిమెంటరీ ప్రయోగ పరీక్షలు మే 1 నుంచి 4 వరకూ, థియరీ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1 వరకు జరుగుతాయన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి హెచ్.అజయ్ రాజు 985 (ఎంపీసీ), పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని జి.కళ్యాణి 975 (ఎంపీసీ), బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.కళ్యాణి 961 (ఎంఎల్‌టీ) మార్కులతో ప్రతిభ కనబర్చారు. అలాగే నూజివీడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని టి.మల్లీశ్వరి 958 (సీఈసీ), కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి వీకేవీ వరుణ్ 957 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఆగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని వి.లావణ్య (బైపీసీ) 422, బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని వి.కృష్ణ ప్రియ 478 (ఎంఎల్‌టీ), జంగారెడ్డిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆర్. ఇందుశ్రీ 419 (బైపీసీ), బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని సీహెచ్ అర్చన 475 (ఎంఎల్‌టీ), నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పి.సంధ్య 474 (సీఈసీ) మార్కులు సాధించి సత్తాచాటారు.

జగన్‌తోనే అందరికీ న్యాయం

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ముసునూరు: పేద ప్రజలందరికీ సమన్యాయం చేయగల సమర్థుడు సీఎం జగన్ అని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల, యూత్ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, గూట్రు రంగారావు ఆధ్వర్యంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌తో కలిసి చెక్కపల్లిలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పారావు, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ మాట్లాడుతూ జననేత జగనన్నకు మళ్లీ అధికారాన్ని అందించి, మరోమారు ముఖ్యమంత్రిని చేయడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిని శాశ్వతంగా నిలబెడదామని పిలుపునిచ్చారు. ప్రజలంతా నవరత్నాల పథకాల ద్వారా లబ్ధిని పొంది, మళ్లీ జగనన్న ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జగనన్న నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పథకాలను రూపొందించి, నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేశారన్నారు. ధైర్యశాలి, పరిపాలనాదక్షుడు జగన్ అని కొనియాడారు. సమన్యాయం జగనన్నతోనే సాధ్యమని పాలనలో నిరూపించారన్నారు. నూజివీడు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

గజమాలతో సన్మానం

చెక్కపల్లి మెయిన్ సెంటర్‌లో గ్రామ పార్టీ అధ్యక్షుడు దత్తుడు శ్రీను, సీనియర్ నేతలు దేవేంద్ర, రమేష్ గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. యువకులు బైక్‌లు, బాణసంచా కాల్పులు, జగనన్న పాటలకు డ్యాన్సులతో సందడి చేస్తూ కార్యకర్తల్లో మరింత జోష్ నింపారు. ఆయా కార్యక్రమాల్లో నూజివీడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బర్మాసీతారామయ్య, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్థానిక ఎంపీటీసీ తోట రమాదేవి, ఉప సర్పంచ్ పద్మజ, సొసైటీ అధ్యక్షుడు కె.లింగారావు, సీనియర్ నేతలు టి.వెంకటేశ్వరరావు, మురళి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు


పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డ్స్ అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: చదరంగం సాధనతో పిల్లల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని సాహిత్య అకాడమీ చైర్మన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఏలూరు సమీపం వట్లూరులోని శ్రీసిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ ఆవరణలో ఒక్కరోజు రాష్ట్రస్థాయి రాపిడ్ చెస్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీలక్ష్మి మాట్లాడుతూ చెస్ పోటీలు నిర్వహించడం వల్ల పిల్లల తెలివితేటలకు పదును పెరుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న డి.లక్ష్మణరావు, వి.అభిరామ్, ఎల్.మౌళి, ఎం.బాల శ్రీనివాసరావు, సీహెచ్ వివేక్, ఎం.శ్రీనివాసరావు, ఎల్.అరవింద్‌బాబు, జి.అరుణకుమారి, జి.హరీష్, ఎన్.వినయ్ బాలసాయి కృష్ణ విజయం సాధించారన్నారు. వీరు భీమవరంలో జూన్ 4 నుంచి 9 వరకూ జరిగే అంతర్జాతీయ చెస్ పోటీల్లో పాల్గొంటారని పోటీల పర్యవేక్షకుడు, అబ్రహం, గ్యారీకాస్పారొవ్ అకాడమీ డైరెక్టర్ జి.యెహనాన్ చెప్పారు.

2200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం


సిద్ధార్థనగర్‌లో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

నూజివీడు: స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని సిద్ధార్థ నగర్, రేగుంట గ్రామాల పరిధిలో సెబ్ అధికారులు, సిబ్బంది కలిసి శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 2200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ నూజివీడు ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తెలిపారు. సిద్ధార్థనగర్ అటవీ ప్రాంతంలో ఉన్న 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రేగుంట ప్రాంతంలో 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసిన చట్టప్రకారం నేరమని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ముసునూరు: ఎంపీడీఓకు రాజీనామాను అందిస్తున్న వలంటీర్లు


మండవల్లి: కానుకొల్లులో రాజీనామాను పత్రాలు చూపుతున్న వలంటీర్లు


చాట్రాయి: ఎంపీడీఓకి రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

పచ్చపైత్యం భరించలేక రాజీనామాలు

- టీడీపీ, జనసేన పార్టీల తీరుపై నిరసన
- ఉన్నతాధికారులకు రాజీనామా పత్రాల అందజేత

ముసునూరు: మండలంలోని పలు గ్రామాల్లో తెదేపా, జనసేన నేతలు, కార్యకర్తలు చేస్తున్న వ్యాఖ్యానాలు, వేధింపులు భరించలేక మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు పలు గ్రామాల వలంటీర్లు ప్రకటించారు. చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, లోపూడి, ముసునూరు, బలివే తదితర గ్రామాలకు చెందిన 170 మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం మధ్యాహ్నం ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవికి తాము వలంటీరు ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నట్లు చెప్పి, రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులకు తమ బాధలను వినిపించారు. వలంటీరు విధులకు పూర్తిగా దూరంగా ఉన్నా, గ్రామాల్లోని తెదేపా, జనసేన కార్యకర్తలు వేధింపులకు దిగి ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. మండలంలో 300 మంది వలంటీర్లు ఉండగా శుక్రవారం సాయంత్రానికి 199 మంది రాజీనామా పత్రాలు అందినట్లు ఎంపీడీఓ తెలిపారు. అనంతరం మాజీ వలంటీర్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు తోట రమాదేవి, పుచ్చకాయల వెంకటేశ్వరరావుతో పాటు నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును కలిసి బాధలను వివరించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామ సచివాలయంలో 21 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి లాభం ఆశించకుండా పని చేసినట్లు తెలిపారు. కరోనా సమయంలో నిస్వార్థంగా పని చేసిన తమపై ఎలక్షన్ కోడ్ వచ్చిన తర్వాత ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరుకు మనస్తాపానికి గురై వలంటర్ విధులకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎవరి బలవంతం లేదన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని పోతనపల్లి, చిన్నంపేట, నరసింహారావుపాలెం, చనుబండ,మర్లపాలెం గ్రామాల్లోని 86 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. శుక్రవారం ఎంపీడీఓ మంగా కుమారికి రాజీనామా పత్రాలు అందజేశారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలకు మనస్తాపానికి గురై రాజీనామాలు చేస్తున్నట్లు వారు తెలిపారు.


పెదవేగి: ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసి రాజీనామా చేసిన పత్రాన్ని చూపుతున్న జగన్నాథపురం వలంటీర్లు

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: మండలంలోని చిన్నఆగిరిపల్లి, నరసింగపాలెం, నుగొండపల్లి గ్రామాలకు చెందిన 31 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శులకు రాజీనామా పత్రాలును శుక్రవారం అందజేశారు. వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు అపహాస్యం చేశారన్నారు. కక్షతో తమను ప్రజా సేవలను అందించనివ్వకుండా అడ్డుపడ్డారని మండిపడ్డారు.

నూజివీడులో..

నూజివీడు: టీడీపీ, జనసేన పార్టీల అధినేతల వద్ద నుంచి స్థానిక నాయకులు, కార్యకర్తల వరకు వలంటీర్ల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా నూజివీడు పట్టణం, మండలంలోని వలంటీర్లు శుక్రవారం పెద్ద ఎత్తున రాజీనామా చేశారు. నూజివీడు పట్టణంలో మొత్తం 306మంది వలంటీర్లు ఉండగా ఒక్కరోజే 121మంది తమ విధులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను మున్సిపల్ మేనేజర్ కె.మనోజకు అందజేశారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల వ్యవహారశైలికి నిరసనగా రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. అలాగే నూజివీడు మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు కూడా తమ రాజీనామాలను ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్‌కు అందజేశారు. మండలంలో మొత్తం 440 మంది వలంటీర్లు ఉండగా వారిలో 250మంది ఇప్పటి వరకూ. రాజీనామా చేశారు.

పెదవేగిలో..

పెదవేగి: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన 13 మంది వలంటీర్లు శుక్రవారం కొండలరావుపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిశారు. వలంటీర్లపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని వివరించారు. ముందుగా జగన్నాథపురం సెక్రటరీని కలిసిన వలంటీర్లు స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ప్రతిపక్ష నాయకుల విమర్శలను తాళలేక మండలంలోని కైకరం, చేబ్రోలు గ్రామాల్లో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. కైకరంలో 40 మంది వలంటీర్లు తమ రాజీనామాలను ఆ గ్రామ పంచాయితీ కార్యదర్శి నాగేంద్రకుమార్‌కు సమర్పించారు. అలాగే చేబ్రోలులో కూడా 40 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను ఆ గ్రామ కార్యదర్శికి అందించారు.


ఆగిరిపల్లి: గుండపల్లిలో రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు


నూజివీడు: మున్సిపల్ మేనేజర్ కె.మనోజకు రాజీనామా అందిస్తున్న వలంటీర్లు


ఉంగుటూరు: కైకరం కార్యదర్శికి రాజీనామాలను అందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం గుర్తుండేలా సీఎం జగన్‌కు స్వాగతం

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా ఈ నెల 15న తాడేపల్లిగూడెం వస్తున్న సందర్భంగా జగన్‌కు చెప్పే స్వాగతంలో తాడేపల్లిగూడెం ముద్ర కనబడాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. 15న సోమవారం సాయంత్రం చిలకంపాడు వద్ద నుంచి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోకి ముఖ్యమంత్రి జగన్ అడుగుపెడుతున్నారన్నారు. అక్కడి నుంచి బస్సు యాత్ర తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా నల్లజర్ల వైపు సాగుతుందన్నారు. చిలకంపాడు వద్ద నుంచి వెంకట్రామన్నగూడెం సరిహద్దుల వరకు ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలికే విధంగా అన్ని ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. 2004లో మహానేత, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు వస్తున్న సందర్భంలో తాను ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమాన్ని పలుమార్లు గుర్తు చేసి తనను అభినందించారని గుర్తు చేశారు. అదేవిధంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలని అవసరమైన పక్షంలో తనను సంప్రదించాలని తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

టి.నరసాపురం: మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగ్గవరం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన చిలకా లక్ష్మణరావు అతని ఇంటికి తీసుకువెళ్లాడన్నారు. చీమలు తొలగిస్తానని చెప్పి బాలిక దుస్తులు తొలగించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అయితే బాలిక శరీరంపై గాయాలు గుర్తించిన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లక్ష్మణరావుపై కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తణుకు: పట్టణ పరిధిలోని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు శుక్రవారం గుర్తించారు. నరేంద్రసెంటర్ సమీపంలోని ఇరిగేషన్ క్వార్టర్స్ వద్ద సుమారు 30 నుంచి 40 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కె.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. 21వ వార్డు వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఓడించాలి


భీమవరంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: ఉద్యోగ, కార్మికులకు తీవ్ర నష్టం చేసిన కేంద్రంలో బీజేపీను ఆ పార్టీని బలపరుస్తున్న టీడీపీ, జనసేన కూటమిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరంలో కలిపిండి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైస్‌మిల్ కార్మికులు విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో యజమానులకు లాభం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్లు కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. గడిచిన పదేళ్ల కాలంలో పరిశ్రమలు మూసివేసి నిరుద్యోగం పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, కొత్తల సత్యనారాయణ, పి సంసోను, కోళ్ల శ్రీను పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఆగిరిపల్లి: గత నెల 26న గన్నవరం మండలం వీరపనేని గూడెం వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో చిన్నాగిరిపల్లి గొల్లగూడేనికి చెందిన మహిళ శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. గత నెల ఆటో బోల్తా పడిన ఘటనలో చిన్నగిరిపల్లి గొల్లగూడేనికి చెందిన ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. అదే గ్రామానికి చెందిన బడుగు శివమ్మ (33)పిన్నమనేని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు చొదిమెళ్ల ఎఫ్‌సీఐ గోడౌన్స్ సమీపంలో మోటారుసైకిల్ పై వస్తున్న ఇద్దరు యువకులు ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో చికిత్స పొందుతున్న యువకుడు శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన గురజాల శ్యామ్ బాబు (21) తన స్నేహితుడైన పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మారుమూడి సతీష్ (25) ఈ నెల 9న మోటారు సైకిల్‌పై ఏలూరు వచ్చి తిరిగి వెళ్తుండగా చొదిమెళ్ల ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద మోటారు సైకిల్ నడుపుతున్న సతీష్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వారిద్దరూ రోడ్డుపై పడగా శ్యామ్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏలూరు రూరల్ ఎస్సై కె. రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఉంగుటూరు మండలానికి చెందిన ఒక వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉంగుటూరు మండలం చింతాయగూడెంకు చెందిన పులపాక ఏసుబాబు (50)కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించి ఎమ్మెల్సీగా నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం


జంగారెడ్డిగూడెం: మార్కండేయపురం వద్ద నగదును స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం


కామవరపుకోట: నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

జంగారెడ్డిగూడెం: ఎన్నికలు సందర్భంగా ఎన్నికల అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జ్ కేవీ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మార్కండేయపురం వద్ద తనిఖీలు నిర్వహించగా జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం మోటార్ సైకిల్ వెళుతున్న వ్యక్తి నుంచి రూ. 2,36,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించి సదరు వ్యక్తి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ఏఆర్‌ఓ కె.స్లీవజోజికి అందజేశారు. ఏఆర్‌ఓ సదరు నగదును ఏలూరు ట్రెజరీకి పంపించారు. ఈ దాడుల్లో హెచ్‌సీ హెచ్‌సీ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అబ్బులు, మంగరాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కామవరపుకోటలో రూ. 1.64 లక్షల స్వాధీనం

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట కొత్తూరులో వద్ద ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలలో భాగంగా గురువారం రాత్రి 11 గంటల సమయంలో కారులో వెళుతున్న ఒక వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ. 1.64లక్షల స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల ఇన్‌చార్జ్ అధికారి కె.బాబురావు తెలిపారు. ఈ నగదు చింతలపూడి మండలం నామవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారులో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫణీంద్ర ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామని తెలిపారు. వాహనాల తనిఖీలలో పోలీసు సిబ్బంది కె.రమేష్, పి.రాంబాబు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

వీరవాసరంలో రూ.92,800 నగదు స్వాధీనం

వీరవాసరం: ఎన్నికల్లో విధుల్లో భాగంగా వీరవాసరం ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో శుక్రవారం రూ.92,800 నగదు స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ జె.సుశీల దేవి తెలిపారు. పాలకొల్లుకు చెందిన శీలం సుష్మ కారులో రూ. 92,800 తీసుకుని వెళుతుండగా స్క్వాడ్ టీం స్వాధీనం చేసుకుందన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న కారణంగా ప్రజలు రూ.50,000కి మించి నగదును వెంట తీసుకుని వెళ్లకూడదని వివరించారు.

ప్రజారంజక పాలనతోనే వైఎస్సార్ సీపీలో చేరికలు

అత్తిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలన కారణంగానే పార్టీలో చేరికలు భారీగా జరుగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి గ్రామంలో యానాదులపుంత నుంచి యానాదులు, గంగిరెద్దులకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ జగన్ పరిపాలనను యావత్ దేశం హర్షిస్తోందని, ఏపీలో అమలవుతున్న పథకాలన్నింటినీ మిగిలిన రాష్ట్రాలు సైతం పరిశీలిస్తుండడం శుభపరిణామమన్నారు. చిన్న వయస్సులోనే మంచి ఆలోచనలతో పేదరికాన్ని తుడిచిపెట్టాలంటే వారికి సంక్షేమం అందించడమే అని ఆలోచించిన గొప్ప మనసున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి అడుగేసేందుకు పార్టీలో చేరిన వారందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఎంటీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


యానాదులపుంతలో వైఎస్సార్ సీపీలో చేరిన యువతతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

గోదావరిలో తల్లీకూతుళ్ల మృతదేహాలు లభ్యం

యలమంచిలి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక భీమవరం పట్టణానికి చెందిన బొంతు కిషోర్‌కుమార్ (32) అతని భార్య యోచన (24) కుమార్తె నిధిశ్రీ (2) బుధవారం చించినాడ వద్ద వశిష్ట గోదావరి నదిలో దూకిన సంగతి విదితమే. ముగ్గురిలో కిషోర్ కుమార్ మృతదేహం గురువారం బాడవ వద్ద గోదావరిలో దొరగ్గా మిగిలిన తల్లీ, కూతురు మృతదేహాలు శుక్రవారం దొరికాయి. ఈ మృతదేహాలన్నింటికీ పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు. ఈ ఘటనపై మృతుని సోదరుడు బొంతు ఉదయ్‌కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వృద్ధుడి అదృశ్యం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామానికి చెందిన 63 సంవత్సరాల కట్రెడ్డి రామారావు(రాంబాబు) గురువారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని అతని కుమారుడు కట్రెడ్డి వినయ్ శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. ఇంట్లో సమస్యలతో బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో దంతో వృద్ధుడి కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు.